సాక్షి
నాగర్‌కర్నూల్
సోమవారం । 27 । మార్చి । 2023



ఎత్తిపోతలకు బ్రేక్

కృష్ణానదిలో నీటిమట్టం తగ్గడంతో కేఎల్‌ఐ ద్వారా సాగునీటి ఎత్తిపోతలను ఆపేశారు.

వివరాలు 8లో ▸



ముగియనున్న పదవీకాలం

జోగుళాంబ ఆలయ పాలక మండలి పదవీ కాలం మంగళవారంతో ముగియనుంది.

వివరాలు 8లో ▸



వాతావరణం

గరిష్టం/కనిష్టం
37.2 /21.1

ఉదయం వేళలో ఆకాశం నిర్మలంగా ఉంది. అప్పుడప్పుడూ మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం ఎండగా ఉంటుంది.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ 6-29
(సోమవారం సాయంత్రం)

సహర్ 5-02
(మంగళవారం తెల్లవారుజామున)

న్యూస్‌రీల్

రేపు వాహన వేలం

నాగర్‌కర్నూల్ క్రైం: ఇటీవల పట్టుబడ్డ ఫోర్‌వీలర్ వాహనాన్ని ఈ నెల 28న జిల్లా కేంద్రంలోని ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ వద్ద వేలం వేయనున్నట్లు ఎక్సైజ్ సీఐ ఏడుకొండలు ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్నవారు రూ.10వేలు డిపాజిట్ చెల్లించి వేలం పాటలో పాల్గొనవచ్చని, వాహనం దక్కకపోతే డిపాజిట్ డబ్బులు తిరిగి ఇవ్వనున్నట్లు తెలిపారు.

ఎన్నికలు ఎప్పుడొచ్చినా సిద్ధంగా ఉండాలి



కల్వకుర్తి రూరల్: ఎన్నికలు ఎప్పుడొచ్చినా బీజేపీ కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని జాతీయ బీసీ కమీషన్ మాజీ సభ్యుడు ఆచారి సూచించారు. ఆదివారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అన్ని రంగాల్లో వైఫల్యం చెంది అసమర్థ ప్రభుత్వంగా మారిందని, లక్షలాది మంది నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడేలా ప్రశ్నపత్రాల లీక్ వ్యవహారంలో ప్రభుత్వంలోని కొందరు మంత్రుల హస్తం ఉందని ఆరోపించారు. ప్రధాని మోదీ అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు తీసుకెళ్లాలని.. కల్వకుర్తి నియోజకవర్గంపై కమలం జెండా ఎగరవేసేందుకు ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేయాలన్నారు. దుర్గా ప్రసాద్, రాఘవేందర్‌గౌడ్, శేఖర్‌రెడ్డి, రవిగౌడ్, వివేకానంద పాల్గొన్నారు.

పదికి సమాయత్తం



- ఏప్రిల్ 3 నుంచి 13వ తేదీ వరకు ఎస్సెస్సీ వార్షిక పరీక్షలు
- జిల్లాకు చేరిన ప్రశ్నపత్రాలు.. పకడ్బందీగా మండలాలకు తరలింపు
- సిబ్బందికి ఇప్పటికే శిక్షణ పూర్తి

అచ్చంపేట: ఏప్రిల్ 3 నుంచి 13వ తేదీ వరకు పదో తరగతి వార్షిక పరీక్షలు కొనసాగనుండగా.. జిల్లా యంత్రాంగం సంబంధిత ఏర్పాట్లలో నిమగ్నమైంది. ప్రతిరోజు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు పరీక్ష ఉంటుంది. అయితే ఈసారి పరీక్ష కేంద్రం లోపలికి అనుమతించేందుకు ఐదు నిమిషాల సడలింపు ఇచ్చారు. కానీ గతంలో విద్యార్థులు ప్రశ్నపత్రం చదువుకునేందుకు ఇచ్చే 15 నిమిషాల సమయాన్ని తొలగించారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల కోసం ఆయా రూట్లలో ప్రత్యేక బస్సులు నడపాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు.

10,572 మంది హాజరు

జిల్లా వ్యాప్తంగా ఉన్న 295 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుంచి 10,572 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. వీరి కోసం 61 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షల నిర్వహణపై కలెక్టర్ ఉదయ్‌కుమార్ ఇప్పటికే పలుశాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో వ్యవహరించాలని ఆదేశించారు. ఉత్తమ గ్రేడ్‌లు సాధించడానికి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు సైతం నిర్వహిస్తున్నారు. ఇదిలాఉండగా, ప్రతి పరీక్ష కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. ప్రశ్న పత్రాలను నిర్దేశించిన సమయానికి, చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ అధికారుల పర్యవేక్షణలో తెరుస్తారు. కేంద్రాల్లో నిర్వహించే ప్రక్రియను వెబ్‌కాస్టింగ్ ద్వారా జిల్లా కలెక్టర్ పరిశీలించే ఏర్పాటు చేశారు.

➡ ఆన్‌లైన్‌లో హాల్‌టికెట్లు విద్యార్థులంతా www.bse.telangana.gov.in వెబ్‌సైట్ ద్వారా హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకునేందుకు అవకాశం కల్పించారు. పరీక్ష కేంద్రాలకు వచ్చే ఫ్లైయింగ్, సిట్టింగ్ స్క్వాడ్‌తో పాటు ఇతర సిబ్బంది ఎవరికీ కూడా సెల్‌ఫోన్ అనుమతి లేదు. ప్రతి ఒక్కరు గుర్తింపు కార్డును ధరించి కేంద్రాలకు హాజరు కావాలి.

అన్ని సౌకర్యాలు సమకూరుస్తున్నాం..



పదో తరగతి పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరు అంకితభావంతో పనిచేయాలి. సీ–క్యాటగిరీ పరీక్ష కేంద్రాల అధికారులు పోలీస్‌స్టేషన్ నుంచి కేంద్రాలకు ప్రశ్నపత్రాలను తరలింపు సమయంలో అత్యంత జాగ్రత్తగా వ్యవహరించేలా చర్యలు తీసుకున్నాం. జిల్లా వ్యాప్తంగా 61 పరీక్ష కేంద్రాలను గుర్తించాం. వేసవి నేపథ్యంలో ఆయా సెంటర్లలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మంచినీటి వసతి, ఫ్యాన్లు ఉండేలా అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించాం.

– గోవిందరాజులు, డీఈఓ

స్ట్రాంగ్ రూంలలో ప్రశ్నపత్రాలు

పదో తరగతి పరీక్షలకు సంబంధించిన ప్రశ్నపత్రాలు జిల్లాకు చేరుకున్నాయి. మొదట ఎస్పీ కార్యాలయానికి చేరుకోగా అక్కడి నుంచి డీఈఓ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు మధ్య జిల్లాలోని 18 పోలీస్‌స్టేషన్లకు తరలించారు. అక్కడి స్ట్రాంగ్ రూంలలో వాటిని భద్రపరిచారు. పరీక్షకు గంట ముందుగానే కస్టోడియన్లు పోలీస్ సిబ్బందితో కలిసి ప్రశ్న పత్రాలను పరీక్షా కేంద్రాలకు తీసుకెళ్లడం, అనంతరం పోస్టల్‌శాఖ ద్వారా పకడ్బందీగా పంపేలా చర్యలు తీసుకున్నారు. పోలీసు బందోబస్తు, ఫ్లైయింగ్ స్క్వాడ్ కోసం ఎస్కార్ట్ వాహనాలు ఏర్పాటు చేశారు. ఇదిలాఉండా, పదో తరగతి పరీక్షలకు ఎండలే అసలు సమస్యగా మారనున్నాయి. వచ్చే నెల మరింత తీవ్రంగా ఉండే అవకాశం ఉంది. ఈక్రమంలో విద్యార్థులకు వార్షిక పరీక్షల కంటే ముందు ఎండలను ఎదుర్కోవడమే అసలు పరీక్షగా మారనుంది. దీంతో పరీక్ష కేంద్రాల వద్ద ఒక ఏఎన్ఎం ఉంచి ప్రాథమిక వైద్య కిట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పరీక్ష సమయంలో నిరంతర విద్యుత్ సరఫరా, మంచినీటి వసతి, శానిటేషన్ ఏర్పాట్లు చేయాల్సి ఉంది. విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరేందుకు ప్రత్యేక ఆర్టీసీ బస్సులను నడపాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద జిరాక్స్ సెంటర్లు మూసివేయాలని,144 సెక్షన్ విధించాలని సూచించారు.

మా జ్ఞాపకాలు 'సమాధి' చేశారు

చర్చనీయాంశంగా మారిన 'సాక్షి' కథనం

- సమాధులపై వేసిన రోడ్డు మీదకు స్వయంగా తరలివచ్చిన బాధిత కుటుంబీకులు
- అప్పుడు అడ్డుకున్నా.. స్పందించలేదని ఆవేదన
- ఇప్పుడు రాజకీయాలంటూ తప్పించుకుంటున్నారని ధ్వజం



సమాధులపై రస్తా..!

'సాక్షి'లో ప్రచురితమైన కథనం

వనపర్తి/వనపర్తి టౌన్/వనపర్తి క్రైం: కాలం చేసిన కుటుంబీకుల జ్ఞాపకార్థం నిర్మించిన సమాధులపై రోడ్డు వేసి.. ప్రజల మనోభావాలను దెబ్బతీసేలా వ్యవహరించిన వైనంపై 'సాక్షి'లో ఈ నెల 25న 'సమాధులపై రస్తా' శీర్షికన కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. తాళ్ల చెరువు ఆధునికీకరణ పేరిట చోటుచేసుకున్న ఈ ఘటన వెలుగులోకి రాగా.. హాట్‌టాపిక్‌గా మారింది. రంజాన్ సందర్భంగా ఈ కట్టపైనే శనివారం ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. మంత్రి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఏ నలుగురు కలిసినా సమాధులపై రోడ్డు వేయడం ఏమిటనే చర్చ జోరుగా సాగింది. అదేవిధంగా ఆదివారం రోడ్డు కింద కనిపించకుండా పోయిన తమ కుటుంబీకుల సమాధులను చూసేందుకు పలువురు స్వయంగా తరలివచ్చారు. తమ పూర్వీకుల సమాధులు ఇక్కడే ఉండేవంటూ వెతుకుతూ 'అధికార' యంత్రాంగంపై నిప్పులు చెరిగారు. సమాధులు ఎక్కడ ఉన్నాయో తెలవడం లేదని.. అభివృద్ధి పేరుతో రోడ్డువేసి రాళ్లతో రివిట్‌మెంట్ నిర్మించారని.. తమ వారిని స్మరించుకునే అవకాశం లేకుండాపోయిందని బోరుమన్నారు. ప్రస్తుత, భవిష్యత్ తరాలను దృష్టిలో ఉంచుకుని శ్మశాన వాటిక కోసం స్థలం కేటాయించాలని మంత్రికి, అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా.. ఇప్పటి వరకు స్థలం కేటాయించలేదని మండిపడ్డారు. అప్పుడు అడ్డుకుంటే పట్టించుకోలేదని ఆవేదన వెలిబుచ్చారు. మా నమ్మకాలను వమ్ము చేయడమే కాకుండా.. మా మనోభావాలను కించపరిచేలా రాజకీయాలు చేస్తున్నారా అంటూ మాపైనే విమర్శలు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఇది సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు.



ఆదివారం తాళ్లచెరువు కట్టపైకి చేరుకుని తమ వాళ్ల సమధుల ఆనవాళ్లను చూసుకుంటున్న బాధితులు

సమాచారం ఇవ్వలేదు..



తాళ్ల చెరువు కట్టమీద మా తాత ముత్తాతల నుంచి ఉన్న సమాధులను ఎలాంటి సమాచారం ఇవ్వకుండా రాత్రికి రాత్రే తొలగించారు. అనంతరం వాటిపై సీసీ రోడ్డు వేశారు. సమాధులు తొలగించి తాత ముత్తాలకు సంవత్సరికం పెట్టుకోకుండా చేశారు.

– జీటీ శ్యాం, గాంధీనగర్, వనపర్తి

చాలా బాధాకరం



గత డిసెంబర్‌లో మా బావ చనిపోతే తాళ్ల చెరువు వద్ద పూడ్చిపెట్టాం. కానీ అభివృద్ధి పేరుతో తాళ్ల చెరువు వద్ద ఉన్న సమాధులన్నీ తొలగించి, వాటిపై సీసీ రోడ్డు వేశారు. చనిపోయిన వారి జ్ఞాపకాలు లేకుండా చేశారు. ముందుగానే సమాచారం ఇచ్చి ఉంటే ఎక్కడో ఒకచోట పెట్టుకునే వాళ్లం. చనిపోయిన వాళ్లను చూసుకోకుండా చేయడం చాలా బాధాకరం.

– రాజు, హరిజనవాడ, వనపర్తి

భయపెట్టారు..



50 ఏళ్ల నుంచి ఉన్న సమాధులను దౌర్జన్యంగా భయపెట్టి రాత్రికి రాత్రి తొలగించారు. డబ్బుల కోసమే తాళ్లచెరువు కట్టపై నాణ్యత లేకుండా సీసీ రోడ్లు వేశారు. ఇక్కడే ఇఫ్తార్ విందులు ఏర్పాటు చేయడం బాధాకరం. ఇలా ఇవ్వడం నేనెక్కడ చూడలేదు. భవిష్యత్‌లో మరెక్కడ జరగకుండా చూడాల్సిన అవసరం ఉంది.

– వెంకటేష్,
21వ వార్డు కౌన్సిలర్, వనపర్తి

స్థలం చూపలే..



ఎవరైనా చనిపోతే పూడ్చేందుకు స్థలం లేదు. ఇదే విషయమై ఎన్నోసార్లు అధికారులను కలవడం జరిగింది. ఏనాడు వారు వచ్చి మాకు స్థలం చూపించిన పాపాన పోలేదు. ఇప్పుడేమో తాత ముత్తాతల నుంచి ఉన్న సమాధులను జేసీబీతో తొలగించారు. సమాధులపైనే సీసీ రోడ్డు వేశారు. ఏడాదికోసారి పెద్దలకు పెట్టుకోవాలంటే ఎక్కడ పెట్టాలో తెలియక రోడ్డుపైనే పూలు చల్లి వస్తున్నాం.

– బుచ్చన్న, కన్నెమ్మ గుడి, వనపర్తి

ఇక్కడే పూడ్చాం..



అమ్మ, నాన్న, తమ్ముడి మృతదేహాలను ఇక్కడే పూడ్చాం. సమాధులను తొలగించేటప్పుడు కాలనీవాసులంతా వచ్చి అడ్డుకునే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ వినకుండా వాటిని తొలగించి, రోడ్లు వేశారు. కూలి, నాలి చేసుకొని బతికే మేము దీనిపై మున్సిపాలిటీలో అడిగాం. వారేమో గవర్నమెంట్‌ను అడగమని చెప్పారు. మా అమ్మ, నాన్న, తమ్ముడికి సంబంధించి సమాధులు లేవని తలచుకుంటేనే ఎంతో బాధగా ఉంది.

– సాయిలు, హరిజనవాడ, వనపర్తి

కలెక్టర్‌ను కలిశాం..



ఇలా తాళ్ల చెరువు కట్టమీద సమాధులను తొలగిస్తున్నారని తెలిసి పలుమార్లు కలెక్టర్‌ను కలిశాం. అయినప్పటికీ వినకుండా మా పెద్దవాళ్ల సమాధులను తొలగించారు. మా కుటుంబీకుల సమాధులను తొలగించి తాళ్లచెరువు కట్టకు ఎస్ఎన్ఆర్ మార్గ్ అని పేరు పెట్టుకున్నారు. ఇంత దౌర్జన్యం ఎక్కడా జరగదు.

– ఆగుపోగు కుమార్, దళితవాడ, వనపర్తి

పూడ్చేందుకు జాగలేదు



దళితులు చనిపోతే పూడ్చిపెట్టేందుకు జాగలేదు. మా పూర్వికులను ఇక్కడే పూడ్చి పెట్టాం. కానీ, కట్ట అభివృద్ధి పేరుతో సమాధులను తొలగించి వారి గుర్తులను చెరిపేశారు. శ్మశాన వాటిక కోసం స్థలం కేటాయించాలని పలుమార్లు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేసి అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదు. ఎన్నికల సమయంలో ఓట్ల కోసం వస్తారు తప్ప.. దళితుల సమస్యలు మాత్రం పట్టించుకోరు.

– బాబురావు, గాంధీనగర్, వనపర్తి

సమంజసం కాదు..



ఎప్పటి నుంచో ఉన్న సమాధులను అభివృద్ధి పేరుతో తొలగించడం ఎంతవరకు సమంజసం. సమాధులు లేకుండా పెద్దలకు ఎలా పెట్టుకోవాలి. ప్రస్తుతం చనిపోయిన వారిని పూడ్చి పెట్టేందుకు కూడా స్థలం లేదు. ఇదే విషయమై పలుమార్లు ప్రజాప్రతినిధులను కోరినా పట్టించుకున్న దాఖలాలు లేవు.

– కొమ్ము సామేల్, దళితవాడ, వనపర్తి

నాడు షాక్.. నేడు కలవరం



పైపైకి బాగానే కనిపిస్తున్నా.. లోలోపల వరుసగా తాకుతున్న పోట్లు ఆ అమాత్యుడిని కలవరానికి గురి చేస్తున్నాయి. తనకు ఎదురేలేదని భావించిన ఆయనను రోజురోజుకూ మారుతున్న రాజకీయ పరిణామాలు కంగుతినేలా చేస్తున్నాయి. మరో ఎనిమిది నెలల్లో రానున్న ఎన్నికలకు సిద్ధమవుతున్న క్రమంలో పరిస్థితులు ఒక్కసారిగా తారుమారు కావడంతో ఆ మంత్రి ఉక్కిరిబిక్కిరి అవుతున్నట్లు తెలుస్తోంది. ఎవరా మినిస్టర్..? ఎక్కడా నియోజకవర్గం..? అసలు ఏం జరుగుతోంది..? అనుకుంటున్నారా.. మీరే చదవండి మరి.

– సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్

రాజీనామాలను జీర్ణించుకోలేకపోతున్న మంత్రి

- పోయిన దగ్గరే వెతుక్కోవాలంటూ ఆత్మీయ సమ్మేళనాలు
- రహస్య సర్వేలతో ప్రజల నాడీ తెలుసుకునేందుకు పాట్లు
- 'రావుల' పేరు ప్రస్తావనపై నేతలకు క్లాస్
- అమాత్యుడి వైఖరిలో మార్పుపై బీఆర్ఎస్ శ్రేణుల్లో చర్చ

విలక్షణ తీర్పునకు వనపర్తి నియోజకవర్గం పెట్టింది పేరు. ఇప్పటివరకు కాంగ్రెస్ నుంచి డాక్టర్ చిన్నారెడ్డి నాలుగు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలిచారు. మంత్రిగా కూడా పనిచేశారు. ప్రస్తుతం ఆ పార్టీ క్రమశిక్షణ సంఘం చైర్మన్‌గా కొనసాగుతున్నారు. బీఆర్ఎస్ నుంచి 2018 ఎన్నికల్లో గెలిచిన నిరంజన్‌రెడ్డి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రిగా ఉన్నారు. సీఎం కేసీఆర్‌కు అత్యంత సన్నిహితుడిగా ఉండడంతో 2014 ఎన్నికల్లో ఓటమిపాలైనా ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడిగా నియమించి ప్రాధాన్యం కల్పించారు. టీడీపీ నుంచి రావుల చంద్రశేఖర్‌రెడ్డి రెండుసార్లు ఇక్కడి నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. చీఫ్‌విప్‌గా విధులు నిర్వర్తించారు. ఏడు మండలాలు ఉన్న ఈ సెగ్మెంట్‌లో అనతికాలంలోనే భారత్ రాష్ట్ర సమితి తిరుగులేని శక్తిగా అవతరించింది. అయితే ఇటీవల జెడ్పీ చైర్మన్ ఆర్.లోక్‌నాథ్‌రెడ్డి, పెద్దమందడి, వనపర్తి ఎంపీపీలు మేఘారెడ్డి, కిచ్చారెడ్డి, సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు ఐ.సత్యారెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ సాయిచరణ్‌రెడ్డితోపాటు మరికొంత మంది ప్రజాప్రతినిధులు పార్టీకి రాజీనామాలు చేశారు. మంత్రి ఏకపక్ష నిర్ణయాలు, ఒంటెద్దు పోకడలు, వేధింపులు తమను ఆవేదనకు గురిచేశాయని.. వచ్చే ఎన్నికల్లో ఆయన ఓటమే లక్ష్యంగా పనిచేస్తామని.. అందరితో చర్చించి భవిష్యత్ కార్యాచరణ నిర్ణయిస్తామని మీడియా సమక్షంలో వెల్లడించారు. వీరి రాజీనామా మంత్రి నిరంజన్‌రెడ్డితోపాటు పార్టీ శ్రేణులనుషాక్‌కు గురి చేసింది.

ఆ పేరు రావొద్దు..

అసమ్మతుల రాజీనామా తర్వాత పలువురు బీఆర్ఎస్ నేతలు ప్రెస్‌మీట్‌లో మాజీ ఎమ్మెల్యే రావుల చంద్రశేఖర్‌రెడ్డి పేరు ప్రస్తావించడంపై మంత్రి సీరియస్ అయినట్లు తెలిసింది. ఆయనకు మైలేజీ ఇచ్చేలా వ్యవహరించడం ఏమిటని క్లాస్ తీసుకున్నట్లు సమాచారం. మనల్ని మనమే తక్కువ చేసుకునేలా ఎవరూ మాట్లాడొద్దని.. ఇంకోసారి ఆ పేరు ఎవరి నోటా రావొద్దని హెచ్చరించినట్లు వినికిడి. ఇదే క్రమంలో వచ్చే ఎన్నికలకు ఏ విధంగా ముందుకు పోవాలనే దానిపై ఆయన వైఖరిని స్పష్టం చేసినట్లు సమాచారం.

రాజీనామా నేతల మండలాల్లో

వచ్చే నెల 25వ తేదీలోగా ఆయా నియోజకవర్గాల పరిధిలో అన్ని మండలాల్లో ఆత్మీయ సమ్మేళనాలు పూర్తి చేయాలని సీఎం కేసీఆర్ ఆదేశించారు. ఈ నేపథ్యంలో వనపర్తి జిల్లాలో బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనాలు జోరుగా సాగుతున్నాయి. పోయిన దగ్గరే వెతుక్కోవాలనే లక్ష్యంతో రాజీనామా చేసిన ఎంపీపీ మేఘారెడ్డి సొంత మండలమైన పెద్దమందడిలో ముందుగా ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. భారీగా జనసమీకరణ చేసి సత్తాచాటారు. కాగా, భవిష్యత్‌లో మరింత మంది అసంతృప్త నేతలు బీఆర్ఎస్‌ను వీడుతారనే ప్రచారం జోరుగా సాగుతుండగా.. ఎవరేం చేసినా గెలుపు బీఆర్ఎస్‌దేనని ఆ పార్టీ నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

అందరూ కీలక నేతలే..

బీఆర్ఎస్‌కు ఇటీవల రాజీనామా చేసిన అసంతృప్తి నేతలందరూ 2018 అసెంబ్లీ ఎన్నికల్లో నిరంజన్‌రెడ్డి గెలుపు కోసం కీలకంగా పనిచేశారు. వీరందరూ దూరమైన పక్షంలో వచ్చే ఎన్నికల్లో ప్రభావం పడే అవకాశం ఉందని.. ప్రస్తుత పరిణామాలు పార్టీకి, మంత్రికి చేటు చేసేలా ఉన్నాయని శ్రేణుల్లో చర్చ జరుగుతోంది. దీంతో కలవరపాటుకు గురైన మంత్రి.. రాజీనామా చేసిన నేతలకు ఉన్న ప్రజాబలాన్ని క్షేత్రస్థాయిలో అంచనా వేసేందుకు రహస్య సర్వేకు శ్రీకారం చుట్టినట్లు సమాచారం. బీఆర్ఎస్ పార్టీ, మంత్రిపై ప్రజల నాడీ సైతం తెలుసుకోవాలని సర్వే బృందాలకు ఆయన సూచించినట్లు తెలిసింది. వనపర్తి మున్సిపాలిటీలోని 33 వార్డుల్లో ఇతర ప్రాంతాలకు చెందిన యువకులు, పెద్దమందడి మండలంలో పోలీస్ ఇంటిలిజెన్స్ వర్గాల ద్వారా సర్వే కొనసాగుతున్నట్లు తెలుస్తోంది.

'పాలమూరు' పనుల పరిశీలన



వట్టెం ప్రాజెక్టును పరిశీలిస్తున్న ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యేలు తదితరులు

భూత్పూర్/ బిజినేపల్లి: పాలమూరు– రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తయితే పరిగి, చేవేళ్ల, వికారాబాద్‌కు సాగునీరు వస్తుందని చేవేళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి అన్నారు. ఆదివారం వికారాబాద్ ఎమ్మెల్యే ఎం.ఆనంద్, పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్వర్‌రెడ్డితో పాటు 600 మందికిపైగా ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో కలిసి 80కిపైగా కార్లలో నాగర్‌కర్నూల్ జిల్లా వట్టెం, మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలంలోని కర్వెన ప్రాజెక్టును పరిశీలించారు. జలాశయంలో నీటి నిల్వ, పంపింగ్‌ను ప్రత్యేకంగా తిలకించి పనితీరును ప్రాజెక్టు కాంట్రాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్టు సామర్థ్యం, నీటి తరలింపు, సాగు విస్తీర్ణం, ప్రాజెక్టుతో రైతులకు కలిగే ప్రయోజనాలు ఎంపీ రంజిత్‌రెడ్డి వివరించారు. అనంతరం 15వ ప్యాకేజీలోని ప్రసాద్ ఇన్‌ఫ్రా కంపెనీలో మధ్యాహ్న భోజనం చేసిన తర్వాత ప్రాజెక్టు ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. సీఎం కేసీఆర్ ప్రాజెక్టు సందర్శన, ప్రాజెక్టులో చేపట్టిన పనులను ఫొటోలను పరిశీలించారు. వీరి వెంట అడ్డాకుల జెడ్పీటీసీ సభ్యుడు రాజశేఖర్‌రెడ్డి, ప్రసాద్ ఇన్‌ఫ్రా జీఎం రామరాజు, ప్రాజెక్టు అధికారులు విజయభాస్కర్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, రమేష్ ఉన్నారు.

ప్రజల ఆకలి తీర్చడమే లక్ష్యం

కందనూలు: ఆకలితో ఉన్న వారందరి ఆకలి తీర్చడమే సాయితత్వమని.. జిల్లా ఆస్పత్రిలో రోగులు, వారి వెంట వచ్చే సహాయకులకు ఐదేళ్లుగా భోజనం అందిస్తున్నామని సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు శంకరయ్య అన్నారు. ఉచిత భోజన కార్యక్రమం ప్రారంభించి ఐదేళ్లు అయిన సందర్భంగా ఆదివారం ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేశారు. నిత్యం 150 మందికిపైగా మధ్యాహ్న భోజనం ఏర్పాటుచేస్తున్నామని, ఇకపై మరింత మందికి సాయి భక్తుల సహకారంతో అందజేస్తామన్నారు. సాయి ప్రశాంతి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు హకీమ్ మురళి, విశ్వ ప్రసాద్, భూదానం సుబ్బారావు, బాలకృష్ణ పాల్గొన్నారు.

ప్రారంభమైన ఇంటర్ పేపర్ వ్యాల్యువేషన్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఇంటర్మీడియట్ పరీక్షలు మరో రెండు రోజుల్లో పూర్తికానున్న నేపథ్యంలో అధికారులు పేపర్ వ్యాల్యువేషన్‌కు సంబంధించిన ప్రక్రియను ప్రారంభించారు. ఈ మేరకు ఉమ్మడి జిల్లాకు సంబంధించిన పేపర్ వ్యాల్యువేషన్ క్యాంపును మహబూబ్‌నగర్‌లోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో చేపట్టారు. ఆదివారం నుంచి సంస్కృతి సబ్జెక్టు పేపర్ వ్యాల్యువేషన్ ప్రక్రియ మొదలైంది. అయితే వివిధ జిల్లాల నుంచి సంస్కృతి సబ్జెక్టుకు సంబంధించి మొత్తం 23,831 పేపర్లు వచ్చాయి. ఇందులో మొదటి సంవత్సరం 13,321, రెండో సంవత్సరం 10,510 పేపర్లు ఉన్నాయి. వచ్చిన పేపర్లకు మొదట కోడింగ్ ప్రక్రియ చేసిన అనంతరం లెక్చరర్లతో వ్యాల్యువేషన్ చేసేందుకు ఇవ్వనున్నారరు. వ్యాల్యువేషన్ మొదటిరోజు మొత్తం 26 మంది లెక్చరర్లు పాల్గొన్నారు. ఈ ప్రక్రియను డీఐఈఓ వెంకటేశ్వర్లు ఆదివారం పరిశీలించారు. రోజుల వారీగా జవాబు పత్రాలు క్యాంపునకు చేరుకుంటున్నాయని, సబ్జెక్టుల వారీగా వ్యాల్యువేషన్‌కు హాజరుకావాల్సిన లెక్చరర్లకు నేరుగా బోర్డు నుంచి ఆర్డర్లు వెళ్తాయని, వారు తప్పకుండా విధులకు హాజరుకావాలని, ప్రక్రియ సజావుగా సాగేందుకు సహకరించాలని ఆయన కోరారు.

క్లుప్తంగా

పాముకాటుకు గురై యువకుడు మృతి


యుగంధర్(ఫైల్)

శాంతినగర్: పాముకాటుకు గురై యువకుడు మృతిచెందిన సంఘటన వడ్డేపల్లి మున్సిపాలిటీ పరిధిలోని పైపాడులో ఆదివారం చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. బోయ యుగంధర్(21) ఆదివారం తెల్లవారుజామున పశువులకు మేత వేయడానికి కళ్లందొడ్డికి వెళ్లాడు. గడ్డివాము వద్ద పాముకాటుకు గురయ్యాడు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం కర్నూలుకు తరలిస్తుండగా, మార్గమధ్యలో మృతిచెందినట్లు తండ్రి బోయ రాముడు తెలిపారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

జడ్చర్ల: మండలంలోని బూర్గుపల్లి గ్రామ శివారులో గల సూదినికుంట చెరువులో స్నానం చేసేందుకు దూకిన వ్యక్తి ప్రమాదవశాత్తు నీట మునిగి మృత్యువాత పడిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. ఎస్ఐ లెనిన్ కథనం మేరకు.. బూర్గుపల్లికి చెందిన పోలె భగవంత్(30) చెరువులో స్నానం చేసేందుకు దూకాడు. ప్రమాదవశాత్తు చెరువు నీటిలో మునిగి మృత్యువాత పడ్డాడు. మృతదేహానికి బాదేపల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

లారీ బోల్తా పడి డ్రైవర్..



మానవపాడు: లారీ బోల్తా పడి డ్రైవర్ మృతి చెందిన సంఘటన ఆదివారం మండలంలోని జాతీయ రహదారి–44పై చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కమలేష(26), హేమేందర్ ఇద్దరు లారీ డ్రైవర్లు. వీరి లారీలో బండలను లోడ్ చేసుకుని గుజరాత్ నుంచి కర్నూల్ వైపుగా వెళ్తుండగా బోరవెల్లి శివారు ప్రాంతంలో లారీ అదుపు తప్పి బోల్తా పడింది. అక్కడికక్కడే కమలేష్ మృతి చెందాడు. హేమేందర్‌కు గాయాలు కాగా, కర్నూల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సంతోష్ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్లను అడ్డుకున్న గ్రామస్తులు

పెబ్బేరు: మండలంలోని రాంపూర్ శివారులో కృష్ణానది తీరాన ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను గ్రామస్తులు అడ్డుకున్నారు. గద్వాల జిల్లా గుర్రంగడ్డకు చెందిన కొన్ని ట్రాక్టర్లు ప్రభుత్వ పనుల కోసం కృష్ణానది రీచ్‌లో నుంచి ఇసుక తరలిస్తుండగా, రాంపూర్ గ్రామస్తులు అడ్డుకొని పెబ్బేరు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు చేరుకొని ఇసుక రీచ్‌ను పరిశీలించారు. ఇసుక రీచ్‌ను రెండు గ్రామాల శివారులుగా హద్దులను రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేస్తారని ఎస్ఐ జగదీశ్వర్ తెలిపారు.

ఎత్తిపోతలకు బ్రేక్


కేఎల్ఐ ప్రాజెక్టు వద్ద నిలిచిన నీటి సరఫరా

- సాగునీటి అవసరాలకు నిలిపివేసిన కేఎల్ఐ అధికారులు
- శ్రీశైలం బ్యాక్‌వాటర్‌లో 820 అడుగులకు చేరిన నీటిమట్టం
- ఇకపై తాగునీటికి మాత్రమే విడుదల
- ఇప్పటికే అన్ని జలాశయాలను నింపిన అధికారులు
- ఎల్లూరు మినహా మిగతా వాటి నుంచి సాగుకు..

కొల్లాపూర్: కేఎల్ఐ ప్రాజెక్టు ద్వారా సాగునీటి ఎత్తిపోతలను అధికారులు ఆపేశారు. ఇక నుంచి సాగునీటి అవసరాలకు నీటి ఎత్తిపోతలు ఉండవు. ఈ నెల 22న చివరగా నీటి పంపింగ్ చేపట్టిన అధికారులు.. ఇకపై తాగునీటి అవసరాలకు మాత్రమే నీటిని సరఫరా చేయనున్నారు. వేసవికాలం ముగిసే వరకు ఈ ప్రక్రియ కొనసాగనుంది.

తగ్గిన బ్యాక్ వాటర్..

కేఎల్ఐ ప్రాజెక్టుకు కోతిగుండు ప్రాంతం నుంచి కృష్ణా బ్యాక్‌వాటర్‌ను అప్రోచ్ కెనాల్ ద్వారా మళ్లించి ఎత్తి పోస్తారు. కోతిగుండు వద్ద 820 అడుగుల లెవల్ వరకు బ్యాక్ వాటర్ ఉంటే సాగునీటి అవసరాల కోసం నీటిని ఎత్తి పోసుకోవచ్చు. నిర్దేశిత లెవల్ చేరిన తర్వాత సాగునీటి ఎత్తిపోసుకునేందుకు అనుమతులు లేవు. కోతిగుండు వద్ద 820 అడుగుల నీటి మట్టం ఉన్నప్పుడు శ్రీశైలం బ్యాక్‌వాటర్‌లో 34 టీఎంసీల మేరకు నీటి నిల్వ ఉంటుందని అంచనా. వీటిలో 4 టీఎంసీల నీటిని తాగునీటి అవసరాల కోసం సరఫరా చేసుకోవచ్చు.

అనుమతి తీసుకున్నాకే..


ఉమ్మడి పాలమూరుతోపాటు రంగారెడ్డి జిల్లాలోని కొన్ని మండలాలకు కేఎల్ఐ సమీపంలోనే ఉన్న మిషన్ భగీరథ పంప్‌హౌస్ నుంచి తాగునీటి సరఫరా జరుగుతుంది. శ్రీశైలం బ్యాక్‌వాటర్‌లో కోతిగుండు వద్ద 820 అడుగుల నీటి లెవల్ వరకు సాగునీటి అవసరాలకు, 800 అడుగులు చేరేవరకు తాగునీటి అవసరాలకు నీటిని ఎత్తి పోసుకోవచ్చు. 800 అడుగుల దిగువకు నీటి లెవల్స్ పడిపోతే మాత్రం రాష్ట్ర ప్రభుత్వంతోపాటు కృష్ణా రివర్ బోర్డు అనుమతులు తీసుకొని తాగునీటి అవసరాలు తీర్చుకోవాల్సి ఉంటుంది.

ఎల్లూరు రిజర్వాయర్‌కు మాత్రమే..

ఇక నుంచి ఎల్లూరు రిజర్వాయర్ నిండే వరకు మాత్రమే ఎత్తిపోతలు కొనసాగుతాయి. ఎల్లూరు రిజర్వాయర్ నీటినిల్వ సామర్థ్యం 0.36 టీఎంసీలు. ఈ రిజర్వాయర్ నుంచి మిషన్ భగీరథ ద్వారా రోజూ 0.02 టీఎంసీ మేరకు నీటిని తాగునీటి అవసరాలకు సరఫరా చేస్తారు. రిజర్వాయర్‌ను ఒక్కసారి నింపితే దాదాపు 15 రోజుల వరకు తాగునీటికి ఇబ్బందులు ఉండవు. అయితే శ్రీశైలం బ్యాక్ వాటర్‌లో వేగంగా నీటి నిల్వలు తగ్గుతున్న క్రమంలో వారానికోసారి ఎత్తిపోతలు చేపట్టి ఎల్లూరు రిజర్వాయర్‌లో నీటి నిల్వలు తగ్గకుండా చూసేందుకు అధికారులు ప్రణాళిక రూపొందించుకున్నారు.

నిండుకుండల్లా రిజర్వాయర్లు..

కేఎల్ఐ ప్రాజెక్టు పరిధిలో ఎల్లూరుతోపాటు సింగోటం, జొన్నలబొగుడ, గుడిపల్లి గట్టు రిజర్వాయర్లు ఉన్నాయి. అన్ని రిజర్వాయర్లు ప్రస్తుతం నిండుకుండలా ఉన్నాయి. వీటిలో ఎల్లూరు మినహా మిగతా రిజర్వాయర్లలోని నీటిని సాగు అవసరాలకు అనుగుణంగా వినియోగించుకోవచ్చు. కానీ, ఎల్లూరు రిజర్వాయర్‌లోని నీటిని మాత్రం సాగునీటి అవసరాలకు విడుదల చేసే అవకాశం లేదు.


ఎల్లూరు రిజర్వాయర్‌లో ప్రస్తుత నీటినిల్వ

ఇబ్బందులు లేవు..



కేఎల్ఐ ప్రాజెక్టు ద్వారా సాగునీటి అవసరాలకు నీటి ఎత్తిపోతలు నిలిపివేసినట్లు మాకు సమాచారం ఇచ్చారు. ఇక నుంచి కేవలం తాగునీటి అవసరాలకు మాత్రమే నీటిని ఎత్తిపోస్తాం. ఎల్లూరు రిజర్వాయర్‌లో నీటినిల్వ తగ్గితే వెంటనే మాకు సమాచారం ఇవ్వాలని ప్రాజెక్టు అధికారులు చెప్పారు. ప్రస్తుతం ఎల్లూరు రిజర్వాయర్‌లో నీళ్లు సమృద్ధిగానే ఉన్నాయి. వారానికోసారి రిజర్వాయర్‌లోకి కృష్ణానీటిని ఎత్తిపోస్తామని ప్రాజెక్టు అధికారులు చెప్పారు. అలా చేస్తే తాగునీటి సరఫరాకు ఎలాంటి ఇబ్బందులు ఉండవు.

– అంజాద్‌పాషా, డీఈఈ, మిషన్ భగీరథ పంప్‌హౌజ్

క్రమంగా తగ్గుతోంది..



కృష్ణా బ్యాక్ వాటర్ లెవల్స్ క్రమంగా తగ్గుతున్నాయి. సాగునీటి అవసరాలకు నీటి ఎత్తిపోతలు పూర్తయ్యాయి. ప్రస్తుతం ఉన్న నీటి లెవల్స్ ప్రకారం తాగునీటి అవసరాలకు మాత్రమే ఎత్తిపోయాల్సి ఉంటుంది. మిషన్ భగీరథ స్కీంకు ఇబ్బందులు లేకుండా ఎప్పటికప్పుడు ఎత్తిపోతలు చేపడతాం. ఎల్లూరు రిజర్వాయర్‌లో నీటి నిల్వ తగ్గకుండా రెగ్యులర్‌గా పర్యవేక్షిస్తున్నాం.

– శ్రీనివాసరెడ్డి, నీటిపారుదల శాఖ ఈఈ

ముగియనున్న పదవీకాలం

- అభివృద్ధికి ప్రాధాన్యమిచ్చిన జోగుళాంబ ఆలయ పాలక మండలి
- నేడు అభినందన సభ


పాలకమండలి సమావేశం (ఫైల్)

జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ జోగుళాంబ బాల బ్రహ్మేశ్వరస్వామి ఆలయ పాలకమండలి పదవీ కాలం మంగళవారంతో ముగియనుంది. దేవస్థానం పరిపాలన విభాగం ఈ విషయాన్ని సంబంధితశాఖ ప్రధాన కార్యాలయానికి లేఖ రాశారు. అదేవిధంగా పాలకమండలికి కూడా ఈ విషయాన్ని తెలియపర్చి సోమవారం దేవస్థానం తరపున అభినందన వీడ్కోలు సభ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి హాజరుకావాల్సిందిగా అటు పాలకమండలి సభ్యులకు, ఇటు ఆలయ ఉద్యోగులకు సమాచారం చేరవేశారు. రాష్ట్రంలోనే ఏకైక శక్తిపీఠమైన అలంపురం జోగుళాంబ బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయాలకు పాలకమండలిలో చోటు దక్కడం 'మామూలు' విషయం కాదు. అదృష్టం, పెద్దల ఆశీస్సులు, మరోవైపు అమ్మవారి దయ ఉంటే తప్పా ఈ అవకాశం రాదు.

పాలనలో మేటిగా..

ప్రస్తుతం పాలకమండలి తమకు లభించిన కాలంలో ఘనమైన అభివృద్ధి పనులు చేపట్టింది. ఆలయ చైర్మన్ బెక్కం శ్రీనివాస్‌రెడ్డి, ఉషాదేవి, మద్దిలేటి, జయన్న, నాగబలిమి, చిన్న కృష్ణయ్య, కుర్వ గోవర్ధన్, హరిబాబు, అనంతేశ్వర్‌రెడ్డి, కుర్వదొడ్ల రాముడు, విష్ణువర్ధన్‌రెడ్డి, నటరాజ్‌యాదవ్, హైమావతితో పాటు ఎక్స్‌అఫీషియో సభ్యుడు ఆనంద్‌శర్మ సమిష్టిగా ఉంటూ వివాదాలకు ఆస్కారం లేకుండా అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తూ ఆలయ చరిత్రలో నిలిచిపోయే అభివృద్ధి పనులు చేపట్టారు. రూ.కోటి 25 లక్షల 11 వేలు ఏపీజీవీబీలో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి భవిష్యత్‌కు పునాది వేశారు. అలాగే ప్రగతిని చూపిస్తూ బెంగుళూరు వేదికగా అంతర్జాతీయ అవార్డు సాధించారు. సుమారు రూ.2.40 కోట్లతో అన్నదాన సత్రం, కల్యాణ మండపం, ప్రసాదాల తయారీ కేంద్రం, ఆర్చి నిర్మాణాలకు దేవాదాయశాఖ నుంచి అనుమతులు తీసుకొచ్చారు. సీఎం కేసీఆర్‌ను ఆలయానికి తీసుకురావాలని గట్టి ప్రయత్నాలు చేసి ఆయన సతీమణి, కుమార్తె కవితను ఆలయాలకు తీసుకొచ్చారు. చేపట్టే అభివృద్ధి పనులను వివరించి ఎంతోకొంత హామీలు సాధించారు. వసతి గదులను ప్రారంభించి భక్తుల ఇబ్బందులు తొలగించారు. అంతేగాకుండా వీఐపీల విడిది కోసం దక్షిణకాశీ భవన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చి ప్రముఖుల మన్ననలు పొందారు. పాత ఆస్పత్రి భవన స్థలాన్ని దేవస్థానం స్వాధీనం చేశారు.

వచ్చే గౌరవ వేతనాన్ని సైతం..

ఆలయ పాలకమండలి చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డికి దేవాలయం తరపున కొంత గౌరవ వేతనం ఇచ్చేవారు. ఆయన వాటితో పాటు తన సొంత డబ్బు కూడా కలిపి అమ్మవారికి వడ్డాణం, హారం చేయించారు. ఆలయానికి తనవారు ఎవరు వచ్చినా వారికి ప్రత్యేక పూజలు చేయించినప్పుడు వారికి తెలియకుండా తానే టిక్కెట్ తీసుకొని ఆలయ ఆర్థిక పురోగతికి అండగా నిలిచారు.

దేశానికి రోల్‌మోడల్‌గా తెలంగాణ


బట్టోనిపల్లితండాలో ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి

నవాబుపేట: పల్లెలన్నీ భక్తిపారవశ్యంతో మునిగిపోయి సంతోషంగా ఉండటానికి సీఎం కేసీఆర్ చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలే నిదర్శనమని ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని బట్టోనిపల్లితండాలో ఆంజనేయస్వామి ఆలయ ప్రారంభం, నూతన విగ్రహాల ప్రతిష్ఠ, జంగమయ్యపల్లి హనుమాన్ ఆలయానికి భూమి కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాన్యనాయక్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఏర్పాటుకు ముందు ఉద్యమ సమయంలోనే కేసీఆర్ ప్రత్యేక తెలంగాణలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై ప్రణాళిక రూపొందించారని వివరించారు. అందుకు ముందుగా పల్లెల అభివృద్ధిపై దృష్టిసారించిన కేసీఆర్ వాటిని అనతికాలంలోనే అగ్రగామిగా తీర్చిదిద్దారని, దాని ఫలితంగానే ప్రస్తుతం పల్లెలు సుఖశాంతులతో పండగ వాతావరణంలో తులతూగుతున్నాయన్నారు. తెలంగాణ దేశానికి రోల్‌మాడల్‌గా మారిందని వివరించారు. బీఆర్‌ఎస్ ఏర్పాటుతో బీజేపీకి భయం పట్టిందని అందుకే కేసీఆర్ కుటుంబంపై కక్ష సాధింపు చర్యలకు పూనుకుంటున్నారని విమర్శించారు. అనంతరం దాదాపు రూ.30 లక్షలతో జంగమయ్యపల్లిలో నూతనంగా నిర్మించనున్న భజరంగ్‌బలి ఆలయానికి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీల సంఘం జిల్లా అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ నర్సింహులు, సర్పంచ్ వెంకటేష్, అభిమన్యురెడ్డి, చెన్నయ్య, మార్కెట్ వైస్ చైర్మన్ చందర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశ్నించే గొంతుకను అణచివేస్తున్న కేంద్రం

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జాన్‌వెస్లీ

మహబూబ్‌నగర్ న్యూటౌన్: నియంతృత్వ ధోరణిలో ప్రశ్నించే గొంతుకను బీజేపీ ప్రభుత్వం అణచివేస్తోందని.. కేంద్రంలో మరోసారి అధికారంలోకి రావాలని కుట్రలు చేస్తోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జాన్‌వెస్లీ అన్నారు. సీపీఎం జన చైతన్య యాత్రలో భాగంగా మహబూబ్‌నగర్ పుర కార్యాలయం ఎదుట ఆదివారం రాత్రి నిర్వహించిన సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కులమతాలతో విద్వేషాలు రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తోందని మండిపడ్డారు. పెట్టుబడిదారీ వ్యవస్థకు అనుకూలంగా వ్యవహరిస్తోందని.. అనుకూల చట్టాలను తీసుకొచ్చి ప్రజలను ఇబ్బందులకు గురిచేసే చర్యలకు పూనుకుంటుందని తెలిపారు. దేశ సంపద కేవలం పది మంది చేతుల్లోకి వెళ్లిందని.. రూ.28 లక్షల కోట్లు వారి చేతుల్లోకి వెళ్లడానికి ప్రధాని మోదీ వ్యవహరిస్తున్న కార్పొరేట్ అనుకూల విధానాలే కారణమని ఆరోపించారు. బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని మార్చాలనే కుట్ర చేస్తే తిరగబడతామని హెచ్చరించారు. తలకిందులు తపస్సు చేసినా పాలమూరులో బీజేపీ ఒక్క సీటు కూడా గెలవదన్నారు. సామాజిక న్యాయాన్ని తుంగలో తొక్కిన బీజేపీని బహిష్కరించి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలనే ఉద్దేశంతో ఈ యాత్ర చేపడుతున్నట్లు తెలిపారు. దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ విధించడమే కాకుండా నిర్బంధాన్ని కొనసాగిస్తున్నారని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు సాగర్ మండిపడ్డారు. పాలమూరు–రంగారెడ్డికి జాతీయ హోదా ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. ముడా చైర్మన్ గంజి వెంకన్న, మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సింహులు బీఆర్‌ఎస్ పార్టీ తరపున సంఘీభావం తెలిపి బీజేపీ అనుసరిస్తున్న విధానాలను ఎండగట్టారు. సీపీఎం జిల్లా కార్యదర్శి రాములు అధ్యక్షతన జరిగిన సమావేశంలో అమరజ్యోతి, వెంకట్రాములు, కిల్లె గోపాల్, కురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జాన్‌వెస్లీ

చెరువులో పడ్డ ట్రాక్టర్

అమరచింత: చెరుకు లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్ అదుపుతప్పి ఆత్మకూర్ పరమేశ్వరస్వామి చెరువులో పడింది. మస్తీపురం నుంచి చెరుకులోడ్‌తో కృష్ణవేణి షుగర్ ఫ్యాక్టరీకి ట్రాక్టర్ డ్రైవర్ శివారెడ్డి బయలుదేరాడు. ఆదివారం తెల్లవారుజామున ఆత్మకూర్ పరమేశ్వరస్వామి చెరువు కట్టపై వెళ్తుండగా ఎదురుగా వస్తున్న వాహనం తప్పించబోయి అదుపుతప్పి ట్రాక్టర్‌తో సహా చెరువులో పడ్డాడు. స్వల్ప గాయంతో డ్రైవర్ ఈదుకుంటూ ఒడ్డుకు చేరాడు. సంఘటన స్థలానికి ఏఎస్ఐ బీచుపల్లయ్య చేరుకుని క్రేన్ సాయంతో ట్రాక్టర్, ట్రాలీని బయటకు తీశారు.

యువకుడిపై కేసు

భూత్పూర్: మున్సిపాలిటీ పరిధిలోని అమిస్తాపూర్‌కు చెందిన నందిని(19) శనివారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడింది. ఈమె ఇదే గ్రామానికి చెందిన సాబేర్‌ను రెండేళ్లుగా ప్రేమించింది. పెళ్లి చేసుకోవడానికి నిరాకరించడంతో ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు. సోదరుడు జగదీష్ ఫిర్యాదు మేరకు ఆత్మహత్యకు కారణమైన ఎండి సాబేర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పీఎం కిసాన్‌కు దూరం

ఏటా తగ్గుతున్న లబ్ధిదారుల సంఖ్య

- మొదటి విడతలో 99,998 లబ్ధిదారులు
- 13వ విడతలో 76,054 లబ్ధిదారులు
- జిల్లాలో దాదాపు 30వేల మంది కొత్త పట్టాపాసుపుస్తకాలు


కృష్ణాలో సాగు చేసిన వరి

నారాయణపేట: కేంద్ర ప్రభుత్వం 2018 ఫిబ్రవరి 1న పీఎం కిసాన్ యోజనను ప్రవేశపెట్టి ఇప్పటివరకు 13 దఫాలుగా రైతులకు సాయం అందిస్తూవస్తోంది. కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న పీఎం కిసాన్ యోజనలో ఏటా లబ్ధిదారుల సంఖ్య తగ్గుతూ వస్తుండడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. రైతుబంధు పథకం మాదిరిగానే కేంద్ర ప్రభుత్వం పెట్టుబడి సాయంగా ఏటా ఎకరానికి రూ.2వేల చొప్పున మూడు విడతల్లో రూ.6వేలు పెట్టుబడి సాయం రైతుల ఖాతాల్లో జమ చేస్తోంది.

ని'బంధన'లు..

కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న పీఎం కిసాన్ నిధులు జమ చేయడంలో ప్రభుత్వం కొన్ని ని'బంధన'లు పెట్టింది. బ్యాంకు ఖాతాలకు ఆధార్ అనుసంధానం లేని రైతుల ఖాతాల్లో నిధులు జమ చేయడం లేదు. ఆదాయం పన్ను చెల్లించే వారిని పథకంలో నుంచి తొలగించారు. రేషన్‌కార్డు ఆధారంగా కుటుంబంలో ఒక్కరికే పథకాన్ని అమలుచేయడం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, లాయర్లు, డాక్టర్లు, ప్రజాప్రతినిధులు నెలకు రూ.10వేల కంటే అధికంగా పింఛను తీసుకునేవాళ్లని క్రమంగా తొలగిస్తున్నారు. నిబంధనలతో అనర్హులను గుర్తిస్తూ పథకం నుంచి తొలగిస్తుండడంతో లబ్ధిదారుల సంఖ్య తగ్గుతోందని అధికారులు అంటున్నారు.

ఈకేవైసీ చేసుకోక..

పలువురు రైతుల ఖాతాల్లో డబ్బులు జమ కాకపోవడంలో అసలు మతలబు గుర్తించడం లేదు. జిల్లా వ్యవసాయశాఖ అధికార యంత్రాంగం అర్హులైన రైతులు ఈకేవైసీ చేసుకోవాలని సూచిస్తూవచ్చింది. రైతులు కొంతమంది పట్టించుకోకపోవడం.. మరోవైపు అవగాహన లేకపోవడంతో ఈకేవైసీ చేసుకోలేకపోతున్నారు. 11వ విడతలో లబ్ధిదారులు 85,641 మంది ఉండగా 12 విడత వచ్చే సరికి 76,054 మందికి చేరుకుంది. 13వ విడతలో సైతం 76,054 మంది ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. 9,587 మంది రైతులు ఇంకా ఈకేవైసీ చేసుకోలేకపోవడంతోనే వారి ఖాతాల్లో డబ్బులు జమకావడం లేదనిపిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం మాదిరిగా పట్టాపాసుపుస్తకం ఉన్న ప్రతి రైతుకు కాకుండా కొన్ని నిబంధనల మేరకు పీఎం కిసాన్ నిధులు జమ అవుతున్నాయి. ఈకేవైసీ చేసుకోవడంతో నిబంధన ప్రకారంగా అనర్హుల సంఖ్య మాత్రమే తగ్గిందని అధికారులు చెబుతున్నారు.

జిల్లాలో 13 విడతల్లో పీఎం కిసాన్ లబ్ధిదారుల వివరాలు

విడత	లబ్ధిదారులు	అమౌంట్
మొదటి విడత	99,998	రూ.19,99,96,000
రెండో విడత	99,323	రూ.19,86,46,000
మూడో విడత	97,697	రూ.19,53,94,000
నాలుగో విడత	95,874	రూ.19,17,48,000
ఐదవ విడత	94,454	రూ.18,89,08,000
ఆరో విడత	94,350	రూ.18,87,00,000
ఏడవ విడత	92,700	రూ.18,54,00,000
ఎనిమిదో విడత	91,336	రూ.18,26,72,000
తొమ్మిదో విడత	90,108	రూ.18,02,16,000
పదో విడత	89,550	రూ.17,91,00,000
పదకొండో విడత	85,641	రూ.17,12,82,000
పన్నెండో విడత	76,054	రూ.15,21,08,000
పదమూడో విడత	76,054	రూ.15,21,08,000

ఏటా తగ్గుతున్న లబ్ధిదారులు

పట్టాదారుల పాసుపుస్తకం పొందిన రైతుల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో చేర్చకపోవడం, నిబంధనల మేరకు కొంతమంది రైతుల పేర్లను తొలగించడంతో పీఎం కిసాన్ యోజన కింద సాయంపొందే రైతుల సంఖ్య తగ్గుతుంది. జిల్లాలో రైతులకు పీఎం కిసాన్ యోజన కింద మొదటి విడతలో 99,998 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికీ రూ.2 వేల చొప్పున రూ.19, 99,96,000 జమ అయ్యా యి. అయితే ఏటా తగ్గుతూ వస్తుండడంతో 13వ విడత వచ్చే సరికి 76,054 మంది లబ్ధిదారులకు రూ.15,21,08,000 జమ అవుతున్నాయి.

అర్హులందరికీ అందుతాయి..



కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న పీఎం కిసాన్ అర్హులందరికీ నిబంధనల మేరకు అందుతుంది. ప్రతి ఏడాది మూడు విడతలుగా ఒక్కొక్కరికీ రూ.2వేల చొప్పున వారి ఖాతాలో నేరుగా జమ అవుతున్నాయి. 13వ విడతలో 76,054 మంది రైతులకు పీఎం కిసాన్ డబ్బులు జమ అవుతున్నాయి.

– జాన్ సుధాకర్, డీఏఓ, నారాయణపేట

కొత్త పట్టాపాసు పుస్తకాలకు నిరాశే..

జిల్లాలో దాదాపు 30వేల మంది రైతులు పొలాల క్రయవిక్రయాలు, వారసత్వం తదితర వాటితో కొత్తగా వచ్చిన పట్టాపాసు పుస్తకాల రైతులు ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రజాప్రతినిధులు ఈ విషయంపై దృష్టి సారించి, సమస్యను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి మేలు చేయాలని రైతులు అభిప్రాయపడుతున్నారు. జిల్లాలో ఇప్పటివరకు 5వేల మంది రైతులు మృతి చెందినట్లు అధికారులు చెబుతున్నారు. ఆ రైతు కుటుంబాలకు సంబంధించి విరాసత్ చేసుకున్న రైతులకు కొత్త పట్టాపాసు పుస్తకాలు వచ్చాయి. వారికి సైతం ఈ పథకం అమలుకావడం లేదని తెలుస్తోంది.